హనుమకొండ : పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దాస్యం వినయ్ భాస్కర్, పార్టీ శ్రేణులు

సావిత్రీబాయి పూలే స్ఫూర్తిని కొనసాగిద్దాం

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్

హనుమకొండ/పరకాల/భీమదేవరపల్లి/హనుమకొండ చౌరస్తా, మార్చి 10 : సావిత్రీబాయి పూలే స్ఫూర్తిని కొనసాగిద్దామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. పూలే వర్ధంతి సందర్భంగా సోమవారం బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో దాస్యం పాల్గొని, సావిత్రీబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాలకు విద్యనందించేందుకు కృషి చేసిన మహనీయురాలు పూలే అని కొనియాడారు. మహాత్మా జ్యోతిబా పూలేతో కలిసి బహుజనుల బాగుకోసం పాటు పడిందన్నారు. కాంగ్రెస్ బీసీ మహిళలను మోసం చేసిందని విమర్శించారు. హక్కుల సాధన కోసం బీసీ మహిళలు ఏకతాటిపైకి వచ్చి పోరాడాలని పిలుపునిచ్చారు. భారత జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాస్యం విజయ్ భాస్కర్, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పులి రజనీకాంత్, రవీందర్‌రావు పాల్గొన్నారు. అలాగే పరకాల పట్టణంలోని ఓ పాఠశాలలో విద్యార్థులతో కలిసి ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ సావిత్రీబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రశాంత్, హేమంత్ పాల్గొన్నారు. దేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే 128వ వర్ధంతి భీమదేవరపల్లి మండలం ముల్కనూరు ప్రజాగ్రంథాలయంలో జరిగింది. గ్రంథాలయం నిర్వాహకుడు ఎదులాపురం తిరుపతి ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ జడ్పీటీసీ వంగ రవి, నాయకులు సారయ్య, లక్ష్మీరెడ్డి, భిక్షపతి, అశోక్, యాదగిరి పాల్గొన్నారు. మహిళలకు స్ఫూర్తి ప్రదాత సావిత్రీ బాయి అని కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రతాప్‌రెడ్డి అన్నారు. దూరవిద్యా కేంద్రం ప్రాంగణంలో పూలే దంపతుల విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. రిజిస్ట్రార్ రామచంద్రం, దూరవిద్యా కేంద్ర సంచాలకులు సురేశ్‌లాల్, ఐలయ్య, విశ్రాంత ఆచార్యులు ఎర్రగట్టుస్వామి పాల్గొన్నారు.

రైతులు రుణాలను రెన్యువల్ చేసుకోవాలి

పరకాల, మార్చి 10 : రైతులు తమ రుణాలను రెన్యువల్ చేసుకోవాలని మాదారం పీఏసీఎస్ చైర్మన్ నల్లెల్ల లింగమూర్తి అన్నారు. పట్టణంలోని పీఏసీఎస్ కార్యాలయంలో పాలకవర్గ సమావేశం నిర్వహించారు. రైతుల సకాలంలో రెన్యువల్ చేసుకుంటే తక్కువ వడ్డీతో తిరిగి రుణాలు పొందొచ్చని పేర్కొన్నారు. పాలకవర్గ సభ్యులు జంగిలి రాజనర్సయ్య, రావుల విజేందర్‌రెడ్డి, బొట్ల వినయ్, డైగ రాజు, నల్ల నిర్మల, రాజిరెడ్డి, దోమ ప్రమీల, సీఈవో రాజేందర్ పాల్గొన్నారు.

కొండచిలువను పట్టుకున్న ఫారెస్ట్ అధికారులు

పట్టుకున్న కొండచిలువతో ఫారెస్ట్ అధికారులు

కమలాపూర్, మార్చి 10 : మండల కేంద్రంలోని పాత ఇనుప సామాను దుకాణం వద్ద కొండ చిలువను ఫారెస్ట్ అధికారులు సోమవారం పట్టుకున్నారు. స్థానికులు కొండ చిలువను చూసి ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ అశోక్ సిబ్బందితో వచ్చి కొండ చిలువను పట్టుకుని గుట్టల్లో వదిలేశారు.

మోటర్లకు కెపాసిటర్లు బిగించుకోవాలి

దామెర, మార్చి 10 : రైతులు మోటర్లకు కెపాసిటర్లు బిగించుకోవాలని విద్యుత్ శాఖ హనుమకొండ రూరల్ డీఈ సామ్యానాయక్ సూచించారు. సోమవారం దామెరలో విద్యుత్ శాఖ అధికారుల పొలంబాటలో భాగంగా వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 62 వంగిన స్తంభాలు, 220 స్పాన్స్ లూజ్‌లైన్లను గుర్తించి 300 మధ్య స్తంభాలు ఏర్పాటు చేశామన్నారు. రైతులు ఆటోస్టార్టర్లు తొలగించుకోవాలన్నారు. రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని, విద్యుత్ సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా టోల్‌ఫ్రీ నంబర్ 1912కు ఫోన్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏడీఈ దేవేందర్, ఏఈ గుర్రం రమేశ్ పాల్గొన్నారు.

ఇంటర్ స్పాట్ వాల్యుయేషన్ ప్రారంభం

హనుమకొండ చౌరస్తా, మార్చి 10 : హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ స్పాట్ వ్యాల్యుయేషన్ ప్రారంభమైంది. సంస్కృతం పేపర్ 1, పేపర్ 2 వాల్యుయేషన్ ప్రారంభించినట్లు డీఐఈవో గోపాల్ తెలిపారు.

గ్రీవెన్స్ అర్జీలు సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టర్ ప్రావీణ్య
- వివిధ సమస్యలపై 114 విజ్ఞప్తులు

విజ్ఞప్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ, మార్చి 10 : గ్రీవెన్స్ దరఖాస్తులు పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో బాధితుల నుంచి విజ్ఞప్తులు స్వీకరించారు. వివిధ సమస్యలపై 114 అర్జీలు వచ్చినట్లు కలెక్టరేట్ అధికారులు తెలిపారు. వీటిలో రెవెన్యూ పరమైనవి 45, జీడబ్ల్యూఎంసీ 14, ఎంపీడీవోలు 7, కలెక్టరేట్ డీ సెక్షన్‌కు సంబంధించి 4, పరకాల మున్సిపాలిటీ 2, జిల్లా వ్యవసాయ శాఖకు సంబంధించి 2 ఉన్నాయి. అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఆర్వో గణేశ్, డీఆర్డీవో మేన శ్రీను, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు రాథోడ్ రమేశ్, నారాయణ పాల్గొన్నారు.

ఈవీఎం స్ట్రాంగ్ రూముల తనిఖీ..

వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులో జిల్లాకు సంబంధించిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ల(ఈవీఎంలు)ను కలెక్టర్ అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేశారు. ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూముల వద్ద ఏర్పాటు చేసిన భద్రత, సీసీ కెమెరాలు, రికార్డుల నిర్వహణ తదితర రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగం నాయబ్ తహసీల్దార్ విఠలేశ్వర్, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈవీ శ్రీనివాస్‌రావు, శ్యాంసుందర్, సయ్యద్ ఫైజల్లా పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షా కేంద్రం సందర్శన..

సుబేదారిలోని కాకతీయ బాలికల జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించారు. పరీక్షకు హాజరైన విద్యార్థుల సంఖ్య, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు.

వీసీలో పాల్గొన్న కలెక్టర్..

హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి సాగు నీటి నిర్వహణ, సరఫరాపై నీటిపారుదల శాఖ మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, జిల్లాల కలెక్టర్లు, పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి, డీసీపీ సలీమా పాల్గొన్నారు.

25 శాతం రాయితీ సద్వినియోగం చేసుకోవాలి

– కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారద

వరంగల్ : ఎల్ఆర్ఎస్‌పై ప్రభుత్వం ప్రకటించిన 25శాతం రాయితీని సద్వినియోగం చేసుకోవాలని హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారద అన్నారు. సోమవారం కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ కార్యాలయంలో గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి డెవలపర్లు, సర్వేయర్లు, స్థల యాజమానులకు ఎల్ఆర్ఎస్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 31వ తేదీ వరకు ఎల్ఆర్ఎస్ పూర్తి స్థాయి డబ్బులు చెల్లించిన వారికి 25 శాతం రాయితీ వర్తిస్తుందన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి ప్రభుత్వ నియమ నిబంధన మేరకు భూములను క్రమబద్ధీకరిస్తామన్నారు. 2020 ఆగస్టు 26వ తేదీ కంటే ముందు రిజిస్ట్రేషన్ అయి లేవుట్ చేసిన ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి క్రమబద్ధీకరణకు అవకాశం ఉంటుందన్నారు. ఎల్ఆర్ఎస్ చేసుకోని వారు ఇంటి అనుమతి కోసం భూమి విలువపై 14 శాతం ఫీజు చెల్లించాల్సి వస్తుందన్నారు. నిషేధిత ప్రాంతం, చెరువు, కుంటల కింద లేని స్థలాలకు ఎల్ఆర్ఎస్ ఫీజులు ఎంత చెల్లించాలన్నది వారి ఫోన్లకు నేరుగా సమాచారం వెళ్తుందని తెలిపారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తు తిరస్కరణకు గురైతే ప్రాసెసింగ్ ఫీజులో 10 శాతం మినహాయించుకొని మిగతా 90 శాతం తిరిగి వారి ఖాతాలో జమచేస్తామని పేర్కొన్నారు. ఎల్ఆర్ఎస్ ఉంటే ప్లాటుకు రక్షణ ఉంటుందన్నారు. సమావేశంలో కుడా ప్లానింగ్ అధికారి అజిత్‌రెడ్డి, బల్దియా ఇన్‌చార్జి సిటీప్లానర్ రవీందర్ రాడేకర్ పాల్గొన్నారు.

ఎయిడ్స్ వ్యాధి నియంత్రణకు కృషి చేయాలి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్ పాండే

కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి క్షమాదేశ్ పాండే

హనుమకొండ చౌరస్తా, మార్చి 10 : ఎయిడ్స్ వ్యాధి నియంత్రణకు యువత కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్ పాండే అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సహకారంతో వరంగల్ నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో యువజన సంఘాల సభ్యులకు సోమవారం కాకతీయ యూనివర్సిటీలో లైంగిక వ్యాధులపై అవగాహన సమావేశం నిర్వహించారు. నెహ్రూ యువ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ అన్వేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ వెంకటరెడ్డి మాట్లాడుతూ.. దేశ భవిష్యత్ యువతపైనే ఆధారపడి ఉందన్నారు. మ్యాథమెటిక్స్ విభాగం సీనియర్ ప్రొఫెసర్ మల్లారెడ్డి, యూనివర్సిటీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ వాసుదేవారెడ్డి ప్రసంగించారు. ముగింపు సమావేశానికి ముఖ్యఅతిథిగా సీనియర్ సివిల్ జడ్జి క్షమాదేశ్ పాండే హాజరై మాట్లాడుతూ.. 15 నుంచి 20 సంవత్సరాల మధ్య ఉన్న యువత ఎక్కువగా ఈ వ్యాధికి గురవుతున్నారన్నారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి స్టేట్ రిసోర్స్‌పర్సన్, రిటైర్డ్ ప్రొఫెసర్ పింగళి నరసింహారావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఐసీటీసీ సూపర్‌వైజర్ ఆడెపు రామకృష్ణ, మ్యాథమెటిక్స్ విభాగాధిపతి భారవీశర్మ, హాస్టల్స్ డైరెక్టర్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

చదరంగ పోటీల విజేతలకు బహుమతులు..

హనుమకొండ బస్‌స్టేషన్ సమీపంలోని శ్రీహర్ష కన్వెన్షన్ హాల్‌లో వరంగల్ జిల్లా చదరంగ సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా స్థాయి ఓపెన్ టు ఆల్ చదరంగ పోటీలు ముగిశాయి. సీనియర్ సివిల్ జడ్జి క్షమాదేశ్ పాండే, శ్రీహర్ష కన్వెన్షన్ హాల్ డైరెక్టర్ వేణు విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం నిర్వహణ కార్యదర్శి కన్నా మాట్లాడుతూ.. సుమారు 80 మంది క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. మొదటి విజేతగా అల్లాడి శ్రీవత్సన్, రెండో విజేతగా రిత్విక్ గండు, మూడో విజేతగా షేక్ రియాజ్, నాలుగో విజేతగా స్వాతి దేవరపల్లి, ఐదో విజేతగా దీక్షిత్ నిలిచారు. కార్యక్రమంలో చీఫ్ ఆర్బిటర్లు శ్రీనివాస్, ప్రేమ్‌సాగర్, వైశాలి, భాస్కర్ పాల్గొన్నారు.

తాళ్ల పద్మావతి ఇనిస్టిట్యూషన్స్‌కు సహకరిస్తాం

కాజీపేట, మార్చి 10 : తాళ్ల పద్మావతి గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్ విద్యార్థులకు అమెరికాలో ఉన్నత విద్య అందించేందుకు అమెరికా ఫాల్కనర్ యూనివర్సిటీ సహకరిస్తుందని ఆ యూనివర్సిటీ ప్రతినిధులు కేసీ ఓక్లీ, జస్టిస్ బాండ్ అన్నారు. కాజీపేట శివారులోని తాళ్ల పద్మావతి ఇంజినీరింగ్ కళాశాలను ఫాల్కనర్ యూనివర్సిటీ ప్రొఫెసర్లు, అధికారులు సోమవారం సందర్శించారు. అనంతరం తాళ్ల పద్మావతి విద్యా సంస్థ, ఫాల్కనర్ యూనివర్సిటీలు భవిష్యత్‌లో విద్యార్థులకు ఉన్నత విద్య అందించే అంశంపై ఒప్పందం చేసుకున్నాయి. తాళ్ల పద్మావతి కళాశాల డైరెక్టర్లు తాళ్ల వంశీ, చైతన్య, తాళ్ల వరుణ్, ప్రిన్సిపాల్ ఆర్ వేలు, విజయలక్ష్మి, అష్జలున్నీసా, మహేందర్‌రెడ్డి, భాగ్యలక్ష్మి, అజిత్‌కుమార్, అహ్మద్ పాల్గొన్నారు.

కేయూలో మహిళలను సన్మానిస్తున్న కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి

ఆర్థిక స్వావలంబనతోనే మహిళా సాధికారత

హనుమకొండ చౌరస్తా, మార్చి 10 : ఆర్థిక స్వావలంబనతోనే మహిళా సాధికారత సాధ్యమని కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రతాప్‌రెడ్డి అన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయ సెనేట్ హాల్‌లో నిర్వహించిన 'అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో పాల్గొని ప్రసంగించారు. కాకతీయ విశ్వవిద్యాలయం మహిళా ఉద్యమాలకు ప్రధాన కేంద్రమన్నారు. చరిత్రలో ఎంతో మంది ఆదర్శ మహిళలు పాలన, నిర్వహణలో తమ వంతు ముద్ర వేశారన్నారు. అర్థశాస్త్ర విభాగ విశ్రాంత ఆచార్యులు జ్యోతిరాణి, రిజిస్ట్రార్ రామచంద్రం, పాలక మండలి సభ్యులు సురేశ్‌లాల్, రమ, సుకుమారి, అనితారెడ్డి, శ్రీలత, సుజాత పాల్గొన్నారు.

'అన్ని దానాల కంటే రక్తదానం గొప్పది'

అన్ని దానాల కంటే రక్తదానం గొప్పదని కేయూ వీసీ అన్నారు. విశ్వవిద్యాలయ ఇంజినీరింగ్ (కో–ఎడ్యుకేషన్) కాలేజీలో జాతీయ సేవా పథకం, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థుల నుంచి 180కి పైగా యూనిట్ల బ్లడ్ సేకరించారు. జాతీయ సేవా పథకం ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఈసం నారాయణ, కాలేజీ ప్రిన్సిపాల్ రమణ, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వరంగల్ చైర్మన్ విజయచందర్‌రెడ్డి, రాధిక, సుమలత, మహేందర్, ఆసిం ఇక్బాల్, ప్రోగ్రాం ఆఫీసర్లు శైలజ, సౌజన్య, సహాయ రిజిస్ట్రార్ నేతాజీ పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

ఎల్కతుర్తి, మార్చి 10 : మండలంలోని వీరనారాయణపూర్ గ్రామంలో తల్లిని హత్య చేసిన నిందితుడిని సోమవారం ఎల్కతుర్తి పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ పులి రమేశ్ మాట్లాడుతూ.. గత శుక్రవారం రాత్రి గ్రామానికి చెందిన చదిరం రేవతిని ఆమె పెద్ద కుమారుడు అజయ్ గొడ్డలితో భూతగాదా విషయంలో నరికి చంపాడు. చిన్న కుమారుడు విజయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టగా, కోతులనడుమ గ్రామ సమీపంలో పెట్రోలింగ్ చేస్తుండగా, నిందితుడు అజయ్ పోలీసులకు తారసపడ్డాడు. దీంతో నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. సమావేశంలో ఎస్సై ప్రవీణ్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్ మల్లేశం, కానిస్టేబుళ్లు నిరంజన్, గణేశ్, బక్కయ్య, రాజయ్య, వీరస్వామి పాల్గొన్నారు.

ప్రశాంత్‌నగర్‌లో అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ ..

కాజీపేట, మార్చి 10 : కాజీపేట పట్టణం ప్రశాంత్ నగర్‌లో వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ 10వ శాఖను సోమవారం ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ప్రారంభించారు. బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, మాజీ ఎంపీ సీతారాం నాయక్, మాజీ ఎమ్మెల్యేలు అరూరి రమేశ్, కొండేటి శ్రీధర్, హనుమకొండ, వరంగల్ జిల్లా డీసీవోలు సంజీవరెడ్డి, నీరజ, జగన్మోహన్‌రావు, ఫౌండర్ డైరెక్టర్ ముత్తిలింగం, కృష్ణమూర్తి, సీఈవో సత్యానారాయణరావు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన సీపీ సన్‌ప్రీత్ సింగ్

సుబేదారి, మార్చి 10 : వరంగల్ పోలీసు కమిషనరేట్ కొత్త పోలీసు కమిషనర్‌గా సన్‌ప్రీత్ సింగ్ బాధ్యతలు స్వీకరించారు. సోమవారం హనుమకొండలోని సీపీ కార్యాలయంలో బదిలీ అయిన అంబర్ కిశోర్ ఝా నుంచి సన్‌ప్రీత్ సింగ్ బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. వరంగల్ కమిషనరేట్ పరిధిలో వంద శాతం శాంతిభద్రతలను కాపాడుతామని, ప్రజలకు పోలీసులపై నమ్మకం కలిగేలా పని చేస్తామన్నారు. నేరాల నియంత్రణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు కృషి చేస్తామన్నారు. మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టిసారిస్తామని పేర్కొన్నారు. కొత్త సీపీని మర్యాదపూర్వకంగా కలిసిన వారిలో డీసీపీలు సేక్ సలీమా, రాజమహేంద్రనాయక్, అంకిత్‌కుమార్, ఏఎస్పీ చైతన్య, అదనపు డీసీపీలు రవి, సురేశ్‌కుమార్ ఉన్నారు.

నేడు చలివాగు పంపు హౌస్ వద్ద బీఆర్ఎస్ ధర్నా

శాయంపేట మార్చి 10 : మండలంలోని దేవాదుల చలివాగు పంపు హౌస్ వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహిస్తున్నట్లు మాజీ ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జోగంపల్లి చలివాగు ప్రాజెక్ట్ కింద సాగులో ఉన్న పంట పొలాలకు నీరు ఇవ్వకుండా, ఎగువకు నీటిని పంప్ చేసి ఇక్కడి రైతులకు అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకోమన్నారు. పంపులు ఆఫ్ చేయాలని రైతుల పక్షాన ఈ ధర్నా చేపడుతున్నామని, భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి హాజరవుతారని తెలిపారు. ధర్మసాగర్‌కు పంపింగ్ ఆఫ్ చేసి చలి వాగులో బ్యాక్ వాటర్ ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో లంచాలు తీసుకుంటే సస్పెండ్ చేస్తా : ఎమ్మెల్యే గండ్ర

శాయంపేట, మార్చి 10 : ఇందిరమ్మ పథకంలో లంచాలు తీసుకుంటే కాంగ్రెస్ నాయకులను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తానని, అధికారులు తీసుకుంటే క్రిమినల్ కేసులు పెట్టిస్తానని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హెచ్చరించారు. సోమవారం గట్లకానిపర్తిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అలాగే ఎస్సీ కాలనీలో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇళ్లు లేని అర్హులందరికీ ఇందిరమ్మ పథకంలో ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పారు. గట్లకనపర్తిలో 70 ఇండ్ల నిర్మాణం జరుగుతుందని, రూ.5లక్షల వరకు బిల్లు ఇప్పించే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు లబ్ధిదారు దొడ్డి జమున, శంకర్‌ను సన్మానించారు. ఎంపీడీవో ఫణిచంద్ర, నాయకులు దూదిపాల బుచ్చిరెడ్డి, చల్లా చక్రపాణి, శ్రీనివాస్‌రెడ్డి, చిందం రవి పాల్గొన్నారు.

బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి నిధులు పెంచాలి

హనుమకొండ, మార్చి 10 : రాష్ట్ర బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి కేటాయించే నిధులు పెంచాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బీసీ జాక్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరుణహరి శేషు లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. గత బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి రూ.9,300 కోట్ల మాత్రమే కేటాయించారని, ఇది బడ్జెట్‌లో మూడు శాతం కంటే తక్కువ అని, కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో హామీ ఇచ్చిన మేరకు రూ.20 వేల కోట్లు కేటాయించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి రూ. 47,456 కోట్ల కేటాయించారని, తెలంగాణ బడ్జెట్‌లో కార్పొరేషన్ల బలోపేతానికి నిధులు పెంచాలని, కొత్తగా సంచార జాతుల కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో హామీ మేరకు బీసీ సబ్ ప్లాన్ ప్రకటించాలన్నారు.

అధికారులు జాప్యం చేస్తే సహించేది లేదు

ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

నయీంనగర్, మార్చి 10 : ప్రజలకు కల్పించాల్సిన కనీస సౌకర్యాలపై అధికారులు జాప్యం వహిస్తే సహించేది లేదని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. 57వ డివిజన్‌లో మున్సిపల్ కార్పొరేషన్ నిధులు రూ.19లక్షలతో నూతన బ్రిడ్జ్ నిర్మాణానికి పూజ చేశారు. అనంతరం 58వ డివిజన్‌లోని పలు కాలనీల్లో పర్యటించి అధికారులకు పలు సూచనలు చేశారు.

సమ్మేళనంలో పాల్గొన్న ఆర్ట్స్ కాలేజీ 1970 పూర్వవిద్యార్థులు

ఆర్ట్స్ కాలేజీ పూర్వవిద్యార్థుల అపూర్వ సమ్మేళనం

హనుమకొండ చౌరస్తా, మార్చి 10 : సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో 1970లో బీఎస్సీ పూర్తిచేసిన పూర్వవిద్యార్థుల రెండో ఆత్మీయ సమ్మేళనం నగరంలో ఘనంగా జరిగింది. 120 మందిలో 22 మంది మృతి చెందగా, మరి కొందరు విదేశాల్లో స్థిరపడ్డారు. పలు ప్రాంతాలవారు ఒకచోట చేరి తమ పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. చైతన్య డీమ్డ్ టు బీ విశ్వవిద్యాలయ కులపతి పురుషోత్తంరెడ్డి, హనుమకొండ జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం అధ్యక్షుడు ఠాకూర్ రతన్‌సింగ్, కార్యదర్శి సింగారెడ్డి, అడ్వకేట్ ఆగారెడ్డి, రిటైర్డ్ డిపో మేనేజర్ వసంతకుమార్‌రెడ్డి సేవలను వారు కొనియాడారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ, మార్చి 10 : హనుమకొండ టౌన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆపరేషన్స్ డీఈ సాంబారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. టేకుల గూడెం సబ్‌స్టేషన్ పరిధిలోని టేకులగూడెం టౌన్, టేకులగూడెం బీసీ, ఎస్సీ కాలనీ, సోమిడి ఏజీఎల్ఎస్ ఏరియాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, ప్రజలు సహకరించాలని కోరారు.

నేత్రాల సేకరణ

హసన్‌పర్తి, మార్చి 10 : మండల కేంద్రానికి చెందిన మీసరగొండ నర్సయ్య అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. మృతిడి భార్య, కుమారులు నేత్ర దానం చేసేందుకు ముందుకు వచ్చారు. దీంతో వరంగల్ ప్రాంతీయ నేత్ర వైద్యశాల సిబ్బంది ప్రసాద్, నేత్ర సేకరణ నిపుణుడు ప్రదీప్ (కార్నియా) నేత్రాలను సేకరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ (హనుమకొండ) ప్రధాన కార్యదర్శి జనార్దన్‌రెడ్డి కుటుంబ సభ్యులకు నేత్రదాన సర్టిఫికెట్ అందజేసి అభినందించారు. నేత్ర, అవయవ, శరీర దాతల అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పరికిపండ్ల వేణు, మల్లారెడ్డి పాల్గొన్నారు. అవయవాలు దానం చేయాలనుకుంటే 9490133650, 8790548706 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

11 నుంచి ఫాతిమా మాత ఉత్సవాలు

మడికొండ మార్చి 10 : ఈ నెల 11 నుంచి మూడు రోజుల పాటు ఫాతిమా మాత ఉత్సవాలు నిర్వహించనున్నట్లు వరంగల్ బిషప్ ఉడుముల బాల తెలిపారు. కాజీపేట మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడారు. సమావేశంలో ఫాదర్లు కాసు మారెడ్డి, జోసెఫ్, సురేశ్, సురేందర్, నవీన్ అరుణ్, కిరణ్, ఆశీర్వాదం, దయాసాగర్, మ్యాథ్యూస్‌రెడ్డి, వినయ్ పాల్గొన్నారు.

రాయితీని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

హనుమకొండ, మార్చి 10 : రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా అమలు చేయనున్న ఎల్ఆర్ఎస్‌పై కల్పించిన రాయితీని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా రిజిస్ట్రార్ ఫణీందర్ తెలిపారు. సోమవారం హనుమకొండ వంద ఫీట్ల రోడ్డులోని వరంగల్ అర్వో రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్లు, డాక్యుమెంట్ రైటర్లు, రియల్టర్లు, ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. జాయింట్ సబ్ రిజిస్ట్రార్లు రాం నరసింహారావు, ఆనంద్, రూరల్, ఫోర్ట్, నర్సంపేట, పరకాల, వర్ధన్నపేట, సబ్ రిజిస్ట్రార్లు సైదులునాయక్, వెంకట్‌లాల్, శ్రీగిరిధర్, సృజన్ కుమార్, ప్రభాకర్, డీఐజీ కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీరామ్‌కుమార్ పాల్గొన్నారు.

18న కేయూలో రాష్ట్ర సదస్సు

హనుమకొండ చౌరస్తా, మార్చి 10 : కేంద్రంలో మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన యూజీసీ నూతన ముసాయిదాను వ్యతిరేకిస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీలో ఈ నెల 18న 'యూనివర్సిటీ విద్యార్థుల రాష్ట్ర సదస్సు' నిర్వహిస్తున్నామని రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహారావు తెలిపారు. సోమవారం పీడీఎస్‌యూ కాకతీయ యూనివర్సిటీ కార్యవర్గం ఆధ్వర్యంలో అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ ఎదుట రాష్ట్ర సదస్సుకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. కేయూ అధ్యక్షుడు బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి కావ్య, రాష్ట్ర నాయకురాలు అనూష, నాయకులు గణేశ్, యాదగిరి, పెరియార్, సౌమ్య పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★లేడీ టెలికాలర్స్, బ్యాగ్రౌండ్ పెయింటర్స్, కార్టూన్స్ వేసే ఆర్టిస్టులు వెంటనే కావలెను. సంప్రదించండి: 8074288199, హైదరాబాద్.
NT-329857

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

సీఎం మాదిగలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

పరకాల/హనుమకొండ, మార్చి 10 : అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్‌రెడ్డి మాదిగలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఏకు శంకర్ డిమాండ్ చేశారు. పట్టణ కేంద్రంలోని పాత మున్సిపాలిటీ కార్యాలయం వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడంతో పాటు అమలు చేసి రేవంత్ రెడ్డి తన మాట నిలుపుకోవాలన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు చిలువేరు ప్రవీణ్, కొమ్ముల చిరంజీవి పాల్గొన్నారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించి మాదిగలకు న్యాయం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి డిమాండ్ చేశారు. ఎస్సీల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించకుండా గ్రూప్, హెచ్‌డబ్ల్యూవో, ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ జాబ్స్ ఫలితాల విడుదల చేస్తామని ప్రకటించడాన్ని నిరసిస్తూ హనుమకొండ ఏకశిల పార్కు వద్ద ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్ష రెండో రోజుకు చేరింది. దీక్షలో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నేతలు మంద ఇద్దయ్య, మంద కుమార్, జన్ను దినేష్, గద్దల సుకుమార్, వేల్పుల సారంగపాణి పాల్గొన్నారు.

ఎంపీడీవోగా విమల బాధ్యతల స్వీకరణ

నడికూడ, మార్చి 10 : నడికూడ నూతన ఎంపీడీవోగా గజ్జెల విమల సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె గతంలో వేలేరు, దామెర, పరకాల మండలాల్లో ఎంపీవోగా విధులు నిర్వర్తించారు.

ఎస్సీవర్గీకరణ జేఏసీ జిల్లా అధ్యక్షుడిగా రమేశ్

దామెర, మార్చి 10 : ఎస్సీవర్గీకరణ జేఏసీ (జాయింట్ యాక్షన్ కమిటీ) జిల్లా అధ్యక్షుడిగా దామెర మండలం పులుకుర్తి గ్రామానికి చెందిన పాముల రమేశ్ నియమితులయ్యారు. రాష్ట్ర జేఏసీ చైర్మన్ పులిగిల్ల బాలయ్య ఆదేశాల మేరకు వైస్ చైర్మన్ నత్తి కొర్నెల్ రమేశ్‌కు నియామకపత్రం అందజేశారు. కాగా, తన నియామకానికి సహకరించిన జేఏసీ రాష్ట్ర నాయకులకు రమేశ్ సోమవారం కృతజ్ఞతలు తెలిపారు.

మాజీ మంత్రి హరీశ్‌రావుకు ఘన స్వాగతం

హరీశ్‌రావుకు స్వాగతం పలుకుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

ధర్మసాగర్, మార్చి 10 : హనుమకొండ పర్యటనకు వెళ్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావుకు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు వినయ్‌భాస్కర్, మాజీ ఎమ్మెల్యే రాజయ్య, నాయకులు మండలంలోని కరుణాపురం వద్ద స్వాగతం పలికారు. కుడా మాజీ చైర్మన్ యాదవరెడ్డి, డీసీసీబీ జిల్లా డైరెక్టర్ రాజేశ్వర్‌రెడ్డి, నాయకులు కర్ర సోమిరెడ్డి, నర్సింగరావు, రాజేశ్వర్‌రెడ్డి, విజయ్‌రావు, మాజీ కార్పొరేటర్ జోరిక రమేశ్ ఉన్నారు.

గ్రీవెన్స్ వినతుల పరిష్కారంపై దృష్టి పెట్టాలి

గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్, మార్చి 10 : గ్రీవెన్స్‌లో ప్రజలు ఇచ్చిన వినతులను వేగంగా పరిష్కరించాలని కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. సోమవారం కార్పొరేషన్ కౌన్సిల్ హాల్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కాలనీల్లో మౌలిక వసతులు కరువయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం రోడ్లు, డ్రైనేజీలు లాంటి సౌకర్యాలు లేవని వాపోయారు. గ్రీవెన్స్‌లో వినతులు ఇచ్చినా పరిష్కారం కావడం లేవని, పలుమార్లు తిరగాల్సి వస్తున్నదని కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. 41వ డివిజన్ నాగేంద్రకాలనీ రోడ్డు నంబర్–2లో కొంత మంది 20 ఫీట్ల రోడ్డు ఆక్రమించుకుంటున్నారని, వెంటనే అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. 46వ డివిజన్ మడికొండ ఆర్ఎస్ఆర్ కాలనీలో ఇప్పటికే రిలయన్స్ టవర్ ఉన్నదని, దానికి 20 మీటర్ల దూరంలో మరో టవర్ ఏర్పాటు చేస్తున్నారని, అధికారులు స్పందించి అనుమతులు రద్దు చేయాలని కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు. 31వ డివిజన్ పరిధిలోని డాక్టర్స్ కాలనీలో 10ఏళ్ల నుంచి తాగునీటి పైప్‌లైన్ లేక ఇబ్బందులు పడుతున్నామని, ఏర్పాటు చేయాలని కాలనీవాసులు అర్జీ ఇచ్చారు. పోచమ్మమైదాన్ సెంటర్‌లోని ఇక్బాల్ మీనార్‌ను పునర్నిర్మించాలని ఉర్దూ కవులు, రచయితలు వినతిపత్రం అందజేశారు. పోచమ్మమైదాన్ సెంటర్‌లోని సీతారామాంజనేయ స్వామి ఆలయంలో శ్రీరామ నవమి సందర్భంగా లైటింగ్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య కమిషనర్‌కు లేఖ రాశారు. వరంగల్‌లోని డాక్టర్స్, గౌతమీ కాలనీల్లో ప్రభుత్వం నిషేధించిన కోనోకార్పస్ చెట్లను వెంటనే తొలగించాలని వెంకట కరుణాకర్‌రెడ్డి విన్నవించారు.16వ డివిజన్ కోటిలింగాల గుడి రోడ్డు కీర్తినగర్‌లో తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు కోరారు. 3వ డివిజన్ పరిధి పైడిపల్లి శివారులోని 704 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయని, అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ జన్ను షీబారాణి వినతిపత్రం అందజేశారు. అనంతరం కమిషనర్ అధికారులతో మాట్లాడుతూ.. గ్రీవెన్స్ వినతుల పరిష్కారంపై అధికారులు శ్రద్ధ పెట్టాలన్నారు. గ్రీవెన్స్‌లో 90 వినతులు వచ్చాయి. టౌన్‌ప్లానింగ్ విభాగానికి 38, ఇంజినీరింగ్ విభాగం 23, ప్రజారోగ్య విభాగం 10, పన్నుల విభాగం 11, తాగునీటి సరఫరా 7, హార్టికల్చర్ ఒక వినతి వచ్చింది. గ్రీవెన్స్‌లో అదనపు కమిషనర్ జోనా, ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, సీఎంహెచ్‌వో రాజారెడ్డి, డీఎఫ్‌వో శంకరలింగం, హెచ్‌వో లక్ష్మారెడ్డి, ఇన్‌చార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్నరాణి, రాజేశ్వర్, ఎంహెచ్‌వో రాజేశ్, పన్నుల అధికారి రామకృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు..

అంతర్జాతీయ జూడో పోటీలకు వరంగల్ లూయిస్ బ్రెయిలీ ఆదర్శ అంధుల పాఠశాల విద్యార్థులు అర్హత సాధించారు. కార్పొరేషన్‌లో కమిషనర్ అశ్వినివిద్యార్థులను అభినందించారు. లక్నోలో ఫిబ్రవరి 24 నుంచి 28వ తేదీ వరకు జరిగిన 13వ పారా జూడో పోటీల్లో 9 మంది అంధ విద్యార్థులు పాల్గొనగా, ఐదుగురు బంగారు, కాంస్య పతకాలు సాధించారని పాఠశాల బాధ్యులు కమిషనర్‌కు వివరించారు. వినోద్ కుమార్, నాగరాజు మేలో కజకిస్తాన్‌లోని ఆస్తానాలో జరుగనున్న ప్రపంచ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. అనంతరం పోటీల్లో సాధించిన పతకాలు, ట్రోఫీని కమిషనర్ అంధ విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ నలివేల కల్యాణి, మేనేజ్‌మెంట్ సభ్యులు మణిశంకర్ పాల్గొన్నారు.

బల్దియా గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే